# నిజమైన దీపావళి

-గరికకుర్తి రాజేంద్ర

వీధిలో సైకిల్ బెల్ మ్రోగటంతో ఆత్రంగా తలుపుతీస్తూ-

"ఈరోజు కూడా ఆఫీసు త్వరగా వదిలిపెట్టలేదన్న మాట" అంటూ విసుక్కుంది రమ.

"నా ఆలస్యం, నీ విసుక్కోవడం ప్రతిరోజూ ఉండేదేగా, కొత్తదనమేముందిలే!"



అంటూ ఈజీచైర్‌లో మేనువాల్చి పేపరులో తలదూరుస్తూ - "బడినుండి పిల్లలు రాలేదా?" అడిగాడు రాజా.

"వాళ్ళు వచ్చి చాలాసేపయింది. మీకోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూసి, చూసి విసుగెత్తి ఆడుకునేందుకెళ్ళి పోయారు."

"వాళ్ళకు నాతో ఏమిటటా అంత అర్జంటు పని?"

దీపావళి పండగ ముందు పిల్లలకు మీతో మరేంపనుంటుంది? పటాసుల గొడవ తప్ప. 'పండగ రెండు రోజులైనా లేదు, ఇంకా ఎప్పుడమ్మా నాన్నగారు మమ్మల్ని బజారుకు తీసుకెళ్ళి బాణాసంచా కొనిచ్చేది' అంటూ ఇప్పటిదాకా వేపుకుతిన్నారు.

బాధపడుతూ చెప్పింది రమ.

ఆ మాటకు ఖంగుతిన్నాడు రాజా.

"బాగానే ఉంది. చాలీచాలని జీతంతో, రోజు రోజుకీ ఆకాశాన్నంటుతున్న ధరలతో పోటీపడలేక, ప్రతిక్షణం సతమతమైపోతున్న మనలాంటి వాళ్ళకు మధ్యమధ్య పండగల పేరుతో, ఎదురు దాడులు" అంటూ విసుక్కున్నాడు.

"మీరన్నది నిజమే! కాని అలా విసుక్కుంటే ఎలా చెప్పండీ? పండుగలేగా మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడేవి. రోజూ సమస్యలతో సతమతమయ్యే మనలాంటి వాళ్ళకి కొత్త ఊపిరినిచ్చేవి!"

"నాన్నగారూ! వచ్చారా? మేము ఏయే టపాకాయలు తెచ్చుకోవాలో లిస్టు కూడా వ్రాసి ఉంచాం." ఉత్సాహంగా అన్నాడు శ్రీకాంత్.

ఆ లిస్టంతా తేవాలంటే ఏ ఐదు వందలు కావాలో ఆలోచననుండి తేరుకొని...

"ఊ! మనంకొనే పదీపరకా రూపాయల పటాసులకు అత పెద్ద లిస్టు కూడానా? ఏమీ అక్కర లేదు లెండి." అంటూ పిల్లలపై విసుక్కొన్నాడు రాజా.

"పదీ ఇరవై మాకేమొద్దు. మేమడిగిన వన్నీ కొనిస్తేనే మేం మీతో వచ్చేది" కోపంగా అన్నాడు శ్రీకాంత్.

అన్నయ్యకు వంత పాడింది కిరణ్.

"మనం టాటా, బిర్లాల మనుమలమను కొంటున్నారా - లేక నేనేదో పెద్ద ఆఫీసరుననుకొంటున్నారా?



బొటాబొటి జీతమే తప్ప బల్లకింది ఆదాయం లేని ఓ తపాలా గుమాస్తారా మీ నాన్న! ఆ విషయం తెలుసుకోండి' విసుగ్గా అన్నాడు రాజా.

"వాళ్ళు కల్లాకపటం తెలియని చిన్నపిల్లలు. మన ఆర్థిక సమస్యలు, ఉండీలేక పోవడాలు వాళ్ళకేం తెలుస్తాయి? అలాగే కొనిస్తానని తీసుకెళ్ళి మీకు తోచినవేవో కొనిస్తే సరిపోతుందిగా!" అంది అనునయంగా రమ.

తల్లి సంభాషణ విన్న పిల్లలు కోపంతో బుంగమూతి పెట్టారు.

"అలా కొంచెం కొనిస్తానంటే మాకేం అక్కర్లేదు. మాకీసారి పటాసులు చాలా చాలా కావాలి. మా స్నేహితులంతా ఇప్పటికే అన్నీ కొనేశారు." మూతి ముడిచి యాక్షన్‌తో సహా చెప్పాడు శ్రీకాంత్.

"మా క్లాసు పిల్లలుకూడా వాళ్ళు కొనుక్కున్న బాణాసంచాగురించే గొప్పలు చెప్పుకుంటున్నారు. మేం మాత్రం వాళ్ళకంటే తక్కువా?" కోపంగా అడిగింది కిరణ్.

రాజాకు పిల్లల సంభాషణతో సహనం నశించింది.

అసహనానికి అశక్తత తోడై అతణ్ణి వెక్కిరించింది.

"ఊ! ఈ రోజుకు విసిగించింది. చాలుగానీ వెళ్ళి భోంచేసి పడుకోండి. ఆ పటాసుల గొడవేదో రేపు చూద్దాం" అంటూ పిల్లల్ని కసురుకున్నాడు రాజా.

పిల్లల ఆలోచనాసరళికీ, తమ ఆర్థిక పరిస్థితికీ లంకెకుదర్చడం ఎలాగో తెలియక అన్యమనస్కంగా ఉండిపోయాడు.

★ ★ ★

ఆ మర్నాడు ఆదివారం కావడంతో ఆలస్యంగా లేచిన రాజా ముఖం కడుక్కుంటూ బయట పిల్ల సంభాషణ వినడడంతో అటువైపుగా నడిచికొంచెం దూరంగా నిల్చుని వినడం మొదలెట్టాడు.

తాముండేది క్రొత్త కాలనీ కావడంతో అక్కడక్కడా ఏరేసినట్లున్న ఇళ్ళు.

ఎక్కువగా చిన్నచిన్న గుడిసెలు. ఆ కాలనీవాసుల్లో అధికభాగం బీదవాళ్ళే. ఏ పూటకాపూట కాయకష్టం చేసుకొని గంజి నీళ్ళు కాచుకునే వాళ్ళే.

"మీరు దీపావళి పటాసుల తెచ్చుకుంటారా? ఎన్ని?" అని ఆసక్తిగా ఆ పిల్లలను అడుగుతున్నాడు శ్రీకాంత్.

"ఊహు! మేమసలు కొనం."

"ఎందుకని?" తన కళ్ళని చక్రాల్లా తిప్పుతూ ప్రశ్నించింది కిరణ్.

"మా అమ్మావాళ్ళు మాకసలు కొనివ్వరు. మేము ఏడ్చినా పట్టించుకోరు." ముక్తకంఠంతో చెప్పారు పిల్లలు.

"అయ్యో! బాణాసంచా లేకుండా అసలు దీపావళెలా చేసుకుంటారు?" ఆశ్చర్యంగా అడిగాడు శ్రీకాంత్.

"మాకాడ డబ్బులుండవు. అందుకని మీలాంటోళ్ళు కాలుస్తూంటే చూస్తాం. అదే మాకు పండుగ!" కోరస్‌గా జవాబిచ్చారు ఆ గుడిసెవాసుల పిల్లలు.

"అలాగా! అయితే పటాసులు లేకున్నా దీపావళి పండగ చేసుకోవచ్చునన్నమాట." ఆశ్చర్యంగా అంది కిరణ్.

"మీరు ఎలాగూ కాలుస్తారుగా. అప్పుడు పిలవండి. మేంకూడా చూస్తాం." అని పిల్లలు ఒప్పందం చేసుకొని అక్కడనుంచి తుర్రుమన్నారు.

శ్రీకాంత్, కిరణ్‌కు ఎన్నో కొత్త విషయాలు తెలిసినట్లనిపించింది. తమ చుట్టూ నివసించే ఆ గుడిసెవాసుల పిల్లలకంటే తామే ఎంతో మేలనిపించింది. అసలు ఏమీ కొనివ్వని వాళ్ళ అమ్మా, నాన్నల కంటే, తమ తల్లిదండ్రులే వాళ్ళకెంతో మంచి వాళ్ళనిపించారు.

నిమిషంలో ఆ పిల్లల ఆలోచనలో ఎంతో మార్పు కనిపించింది. వాళ్ళ లేత హృదయాల్లో ఆదర్శభావాలు వికసించాయి.

"చెల్లీ! మనం మననాన్నను అన్నికావాలి, ఇన్నికావాలి అని ఇకముందు అడక్కూడదు, మాట్లాడకూడదు! వారు ఏవి కొనిస్తే అవి, ఎన్నికొనిస్తే అన్ని తీసుకోవాలి. సరేనా?" అనునయంగా అన్నాడు శ్రీకాంత్.

"అలాగే" అంది కిరణ్.

ఆ పిల్లల సంభాషణ శ్రద్ధగా విన్న రాజాలో సంఘర్షణ మొదలయింది. నిజంగా ఇంత చదువు చదివీ ఎంతో లోకజ్ఞానం, జీవితానుభవం ఉన్న తమకంటే తమపిల్లలే ఎంతో సంస్కారవంతులనిపించింది.

తక్కువస్థాయిలో, ఎక్కువ కష్టాల్లో ఉన్న వాళ్ళతో పోల్చుకున్నప్పుడే ఎవరికైనా తప్పక తృప్తి కలుగుతుంది.

ఈ దేశంలో కనీసం తనలాంటి ఆర్థిక స్థోమత కూడాలేని వాళ్ళు, ఏపూటకాపూట కూటికోసం వెతుక్కునే వాళ్ళు, పంపునీళ్ళతో కడుపులు నింపుకునే వాళ్ళు ఎందరు లేరు?

ఆరోజు రాత్రి పిల్లలను బజారుకు తీసుకెళ్ళి వాళ్ళకు నచ్చిన పటాసులు కొనిచ్చాడు రాజా. అతని జీవితంలో ఇలాంటి దీపావళులెన్నో చూచాడు.

కాని అతని మనస్సులోని నిరాశ, దురాశాంధకారాన్ని పోగొట్టి, సంతృప్తి అనే వెలుగు పువ్వులు నింపింది ఈయేటి దీపావళే!

మనకున్నది చాలనుకుని తృప్తిపడితే వదనంతో తరిగిపోని దరహాస కాంతి.

ఇంకా... ఇంకా ఏదో కావాలనుకుని అసంతృప్తి పడితే ప్రతిక్షణం... ప్రత్యక్షనరకం!

గర్భకుర్తి రాజేంద్ర
పోస్టల్ అసిస్టెంట్,
ప్రధాన తపాల కార్యాలయము,
కామారెడ్డి - 503 111.